క్లుప్తంగా

గోడ నిర్మాణంతో రైతులకు ఇబ్బంది

డెంకాడ: మండలంలోని డెంకాడ – పినతాడివాడగ గ్రామాల మధ్యలో సాగునీటి కాలువలో అడ్డంగా ఎస్యూర్ రియల్ ఎస్టేట్ వారు అక్రమంగా నిర్మిస్తున్న గోడ వల్ల రైతులకు అన్యాయం జరుగుతుందని గ్రామానికి చెందిన ప్రజా ప్రతినిధులు, రైతులు అన్నారు. ఈ గెడ్డ ద్వారా ఏరాక్య, నేరాడు చెరువులకు ఎగువ ప్రాంతం నుంచి నీరు వస్తుందన్నారు. అటువంటి గెడ్డలో అడ్డంగా గోడ నిర్మిస్తే సాగునీటి పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. అలాగే పినతాడివాడ జగనన్న కాలనీ ముంపు బారిన పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. గెడ్డలో జరుగుతున్న నిర్మాణ పనులను రైతులతో కలిసి డెంకాడ పీఏసీఎస్ చైర్మన్ రొంగలి కనకసింహాచలం, తదితరులు బుధవారం పరిశీలించారు.

కల్వర్టు నిర్మించాలని రైతుల ధర్నా


ధర్నా చేస్తున్న రైతులు

గంట్యాడ: గ్రీన్ ఫీల్డ్ హైవే (హరిత రహదారి)లో భాగంగా రోడ్డు నిర్మాణం వల్ల పంట పొలాలు ముంపునకు గురవుతున్న నేపథ్యంలో కల్వర్టు నిర్మించాలని డిమాండ్ చేస్తూ పెంట శ్రీరాంపురం గ్రామ రైతులు గ్రామంలో బుధవారం ధర్నా చేశారు. రైతులు మాట్లాడుతూ వసంత, పెంటశ్రీరాంపురం గ్రామాలను ఆనుకుని నిర్మిస్తున్న గ్రీన్ ఫీల్డ్ హైవేలో కల్వర్టు ఏర్పాటు చేయకుండా రోడ్డు వేయడం వల్ల పెంట శ్రీరాంపురంలో 50 ఎకరాల పొలం ముంపునకు గురవుతోందని వివరించారు. అధికారులు స్పందించి కల్వర్టు నిర్మించి తమ సమస్యను పరిష్కరించాలని రైతులు కోరారు. రైతులు కరక మహేష్, బి.రామకృష్ణ, కరక కృష్ణ, లగుడు, సత్యవతి, కరక వెంకటరావు, గుల్లిపల్లి రాము, కరక సూరమ్మ, ఆకిరి రమణరావు, గులిపల్లి రామునాయుడు, బండారు గౌరమ్మ పాల్గొన్నారు.

బాధ్యతతో విధులు నిర్వహించాలి

వేపాడ: సచివాలయ సిబ్బంది బాధ్యతతో విధులు నిర్వర్తించాలని ఎంపీడీఓ బి.ఎస్.ఎస్.కె.పట్నాయక్ సూచించారు. పాటూరు గ్రామ సచివాలయాన్ని బుధవారం ఆయన సందర్శించారు. సిబ్బంది హాజరు, ఇతర రికార్డులను పరిశీలించి, ఈ–సర్వీసులపై సచివాలయ సిబ్బందిని ఆరా తీశారు. సిబ్బంది సమయపాలన పాటించాలని, అర్హులందరికీ పథకాలు అందించాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు.

1,791 క్వింటాళ్ల వరి విత్తనాలకు ప్రతిపాదనలు

వేపాడ: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి మండల రైతులకు రాయితీపై పంపిణీ చేసేందుకు 1,791 క్వింటాళ్ల వరి విత్తనాలకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని ఏఓ సి.బి.యశ్వంతరావు తెలిపారు. దబ్బిరాజుపేట రైతు భరోసా కేంద్రం(ఆర్బీకే)లో రైతులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 1,791 క్వింటాళ్ల వరివిత్తనాల కోసం ప్రతిపాదనలు చేయగా 1,434 క్వింటాళ్లకు అలాట్‌మెంట్ వచ్చిందన్నారు. ఎంటీయూ–1121 రకం 1,130 క్వింటాళ్లు, బీపీటీ– 5,204 రకం 85 క్వింటాళ్లు, బీపీటీ–3291 రకం 19 క్వింటాళ్లు, ఎంటీయూ–7029 రకం 200 క్వింటాళ్లకు అలాట్‌మెంట్ అయిందని చెప్పారు. రైతులు తమకు ఏ రకం విత్తనాలు కావాలో వివరాలతో ఆర్బీకేల్లో ఆధార్‌కార్డు, ఫోన్ నంబర్‌తో నమోదు చేసుకోవాలని సూచించారు.

ఘనంగా ఆలయ ప్రారంభోత్సవం

దత్తిరాజేరు: మండలంలోని ఇంగిలాపల్లి గ్రామం బ్రాహ్మణ వీధిలో లక్ష్మీగణపతి స్వామి వారి ఆలయ ప్రారంభోత్సవాన్ని స్థానికుల ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. వేదపండితులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, హోమాలు జరిపించారు. ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య, స్థానిక నాయకులు స్వామివారిని దర్శించుకున్నారు. ఎంపీపీ గేదెల సింహాద్రిఅప్పలనాయుడు, వైస్ ఎంపీపీలు బమ్మిడి అప్పలనాయుడు, మిత్తిరెడ్డి రమేష్, వైఎస్సార్‌సీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మంత్రి అప్పలనాయుడు, మండల జేసీఎస్ కన్వీనర్ మహదేవ్ ఫణీంద్రడు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు గర్భాపు శ్రీను పూజల్లో పాల్గొన్నారు.

రైలు ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి

జామి: రైలు ప్రమాదాల నియంత్రణకు కేంద్ర ప్రభుత్వం సత్వర చర్యలు చేపట్టాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ కోరారు. మండల కేంద్రంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగామాట్లాడుతూ ప్రపంచంలో అతి పెద్ద రైల్వే వ్యవస్థలో ఒకటైన భారతీయ రైల్వేలో తరచూ ప్రమాదాలు ఎందుకు జరుగుతున్నాయో వివరిస్తూ కాగ్ విడుదల చేసిన రిపోర్టును కేంద్రప్రభుత్వం అర్థం చేసుకుని తగిన చర్యలు చేపట్టాలన్నారు. కాగ్ నివేదిక ప్రకారం 2017 నుంచి 2021 వరకు 1129 రైలు ప్రమాదాలు జరిగాయని, వీటిలో 156 ప్రమాదాలు సరైన సమయానికి మెయింటెనెన్స్‌లేక పోవడం వల్లే జరిగాయన్నారు. కేంద్రం రైల్వే శాఖని సేవారంగం నుంచి తప్పించి వ్యాపార రంగంగా మార్చిందని ఆరోపించారు. లోక్‌సత్తా నాయకులు బి.భాస్కర్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే గడప గడపకు..

- ఎమ్మెల్యే బడ్డుకొండ, ఎమ్మెల్సీ పెనుమత్స
- మొయిదలో ఉత్సాహంగా సాగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం


మహిళకు బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు

నెల్లిమర్ల రూరల్: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కారమవుతున్నాయని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు అన్నారు. ఎమ్మెల్సీ స్వగ్రామమైన మొయిద విజయరాంపురం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు నాయకులకు హారతులు పట్టి స్వాగతం పలికారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, తదితరులు ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో ఒక్కో కుటుంబానికి ఎంత లబ్ధి చేకూరినదీ వివరిస్తూ, ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గత టీడీపీ ప్రభుత్వం ఎన్నో అబద్ధపు హామీలను ఇచ్చి ప్రజలను ఎలా మోసం చేసిందో అందరికీ తెలుసునన్నారు. అర్హతే ప్రామాణికంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని... గతంలో ఎన్నడూ ఈ పరిస్థితి లేదన్నారు. జన్మభూమి కమిటీల పేరుతో టీడీపీ నేతలు దోచుకుతిన్నారని గుర్తుచేశారు. ప్రస్తుతం అవినీతి రహిత పరిపాలన అందుతోందని.. నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నట్లు తెలిపారు. సంక్షేమ పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి జగనన్నకు ప్రజలు అండగా నిలబడాలని కోరారు. అనంతరం ప్రజా సమస్యలను అడిగి తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ అంబళ్ల సుధారాణి, జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, రైల్వే బోర్డు సలహా మండలి సభ్యుడు అంబళ్ల శ్రీరాములనాయుడు, డీసీసీబీ వైస్ చైర్మన్ చనమళ్ల వెంకటరమణ, పట్టణ అధ్యక్షుడు చిక్కాల సాంబశివరావు, వైస్‌చైర్మన్ సముద్రపు రామారావు, ఎంపీటీసీ సభ్యుడు పెనుమత్స సంతోష్‌బాబు, టూరిజం, నాగవంశం డైరెక్టర్లు రేగాన శ్రీను, మద్దిల వాసు, వైస్ ఎంపీపీలు పతివాడ సత్యనారాయణ, సారిక వైకుంఠం నాయుడు, సర్పంచ్ అట్టాడ కృష్ణ, నేతలు లెంక గోవింద, అట్టాడ కనకారావు, కోట్ల పైడినాయుడు, శ్రీనివాసరావు, యడ్ల గోవింద, సంచాన సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భవనాలే సాక్షి

- ఎంపీ బెల్లాన చంద్రశేఖర్


మొయిదలో వెల్‌నెస్ కేంద్రం నూతన భవనం శిలా ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ బెల్లాన, ఎమ్మెల్యే బడ్డుకొండ, ఎమ్మెల్సీ పెనుమత్స

నెల్లిమర్ల రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముందు చూపునకు గ్రామాల్లో నిర్మిస్తున్న ప్రభుత్వ భవనాలే సాక్షి అని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని మొయిద విజయరాంపురం గ్రామంలో నిర్మించిన సచివాలయం, రైతుభరోసా, వెల్‌నెస్ భవనాలను స్థానిక ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబుతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థ తీసుకువచ్చి, ప్రజల ముంగిటకే పాలన తీసుకువచ్చారన్నారు. గతంలో ఏ పని కావాలన్నా మండల, జిల్లా కేంద్రాలకు పరుగులు పెట్టేవారని.. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదన్నారు. ఉన్న ఊరిలోనే పనులు పూర్తి చేసుకునే అవకాశాన్ని తమ ప్రభుత్వం కల్పించిందన్నారు.

సుర్రుమంటున్న సూరీడు


చున్నీ కప్పుకొని వెళ్తున్న మహిళ


కూల్‌డ్రింక్‌లతో చిన్నారి


ఆర్టీసీ కాంప్లెక్సు రోడ్డులో యువతి


ట్యాంక్‌బండ్ రోడ్డులో వృద్ధురాలి పాట్లు

జూన్ నెలలో కూడా సూరీడు సుర్రుమంటున్నాడు. కొద్ది రోజులుగా పగటి పూట ఉష్ణోగ్రతలు బెంబేలెత్తిస్తున్నాయి. వేడి గాలులు, ఎండ తీవ్రత ప్రజలను తీవ్ర ఉక్కబోతకు గురి చేస్తున్నాయి. ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఐదు వరకు ఒకటే ఎండ, వేడి గాలులు వీస్తున్నాయి. అత్యవసర పనులుంటే తప్ప ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడానికి హడలిపోతున్నారు. వచ్చేవారు కూడా తగు జాగ్రత్తలు తీసుకుంటూ వచ్చి వెంటనే ఇళ్లకు చేరుకుంటున్నారు. విజయనగరం జిల్లా కేంద్రంలో బుధవారం ఎండ వేడిమికి ప్రజలు అల్లాడిపోయారు. అందుకు సంబంధించిన చిత్రాలే ఇవి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం

విత్తనాలకు పేర్లు నమోదు చేసుకోవాలి

- వ్యవసాయశాఖ విజయనగరం ఏడీఏ నాగభూషణం


మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ ఏడీఏ నాగభూషణం

డెంకాడ: రానున్న ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి విత్తనాలు కావాల్సిన రైతులు ఆర్బీకేల్లో పేర్లు నమోదు చేసుకోవాలని వ్యవసాయ శాఖ విజయనగరం ఏడీఏ నాగభూషణం అన్నారు. మండలంలోని చొల్లంగిపేట ఆర్బీకేలో వ్యవసాయశాఖ ద్వారా అందిస్తున్న సేవలపై రైతులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రైతులకు అవసరమైన ఎరువులను ఆర్బీకేల్లో అందుబాటులో ఉంచామన్నారు. నేలసారం తెలుసుకునేందుకు మట్టి సనమూనాలను సేకరించి వాటి ఫలితాలను రైతులకు తెలియజేస్తున్నట్లు తెలిపారు. ఆర్బీకేల ద్వారా ఎరువులు, పురుగు మందుల సరఫరా, పొలంబడిలో భాగంగా పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. అలాగే వైఎస్సార్ యంత్రసేవ ద్వారా యంత్రాలను రాయితీపై అందిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ విత్తనోత్పత్తి పథకం ద్వారా రైతులకు విత్తనాల తయారీపై తగిన సహాయ, సహకారాలు అందిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ కోరాడ కనకరాజు, ఏఓ పూడి నిర్మల, ఏఈవో ప్రశాంతి, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

కౌలు గుర్తింపు కార్డులతో అనేక ప్రయోజనాలు

- వ్యవసాయశాఖ జేడీఏ రామారావు


కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందజేస్తున్న జేడీఏ రామారావు

బొండపల్లి: కౌలు రైతులకు ప్రభుత్వం అందజేస్తున్న సీసీఆర్‌సీ (క్రాప్ కల్టివేటెడ్ రైట్ కార్డు)లతో అనేక ప్రయోజనాలు ఉన్నాయని వ్యవసాయశాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ వి.టి.రామారావు అన్నారు. మండలంలోని గరుడుబిల్లి రైతు భరోసా కేంద్రం(ఆర్బీకే)లో కౌలు రైతులకు బుధవారం గుర్తింపు కార్డు లు (సీసీఆర్‌సీ)తో పాటు పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు గ్రామాల్లోనే సాగు సంబంధ సేవలన్నీ అందించేందుకు ప్రభుత్వం ఆర్బీకేలను ఏర్పాటు చేసిందన్నారు. గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి అర్హత ఉన్న కౌలు రైతులకు గుర్తింపు కార్డులు జారీ చేస్తున్నామని చెప్పారు. ఈ కార్డుల వల్ల కౌలు రైతులకు అసలు భూయజమానులు వలే అన్ని ప్రయోజనాలను ప్రభుత్వం కల్పిస్తుందని అన్నారు. అన్ని ఆర్బీకేల్లో పచ్చిరొట్ట విత్తనాలను అందుబాటులో ఉంచామని, కావాల్సిన రైతులు తమ వివరాలను ఆన్‌లైన్ చేసుకోవాలని సూచించారు. ఏఓ పి.వి.మల్లికార్జునరావు, మండల వ్యవవసాయ సలహా మండలి సభ్యులు బొడ్డల చిన్నంనాయుడు, లెంక రమణ, ఏఈఓ సంతోష్ కుమార్, వీఏఏలు, వీహెచ్ఏలు పాల్గొన్నారు.

విత్తనాలు, ఎరువులు సిద్ధం


పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలు పంపిణీ చేస్తున్న ఏఓ కిరణ్‌కుమార్

జామి: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతులకు సరఫరా చేసేందుకు వరి, పచ్చిరొట్ట విత్తనాలు, ఎరువులను అన్ని రైతు భరోసా కేంద్రాల్లో (ఆర్బీకే) సిద్ధం చేస్తున్నామని ఏఓ కిరణ్‌కుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని ఆర్బీకేలో రైతులకు ఖరీఫ్ పంటల సాగుపై బుధవారం అవగాహన కల్పించారు. పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రైతుల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను, భూసార పరీక్షల ప్రాముఖ్యత, వాటివల్ల కలిగే ఉపయోగాలను రైతులకు వివరిం చారు.50 శాతం రాయితీపై పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలను ప్రభుత్వం సరఫరా చేస్తోందని, అన్ని ఆర్బీకేల్లో ఈ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. మండలానికి ప్రభుత్వం 2,160 క్వింటాళ్ల వరి విత్తనాలను ప్రభుత్వం కేటాయిం చిందని, విత్తనాలు కావాల్సిన రైతులు ఆర్బీకేల్లో సంప్రదించాలని సూచించారు. కౌలు రైతులు అంతా గుర్తింపు కార్డుల కోసం వీఏఏల ద్వారా వీఆర్ఓలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మండలంలోని 17 ఆర్బీకేల్లో డీఏపీ, యూరియా ముందు జాగ్రత్తగా నిలువ చేశామని చెప్పారు. అనంతరం రైతులకు పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలు పంపిణీ చేశారు. సర్పంచ్ లక్ష్మి, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.


వేతనదారుల హాజరు పెంచండి


మాట్లాడుతున్న ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్

బొండపల్లి: గ్రామాల్లో ఉపాధి హామీ పనులకు వేతనదారుల హాజరు పెంచడానికి క్షేత్ర సహాయకులు కృషి చేయాలని ఎంపీడీఓ వై.వి.రాజేంద్రప్రసాద్ ఆదేశించారు. స్థానిక ఉపాధి హామీపథకం కార్యాలయంలో మండలంలోని అన్ని గ్రామాల క్షేత్ర సహాయకులతో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఎండల తీవ్రత కారణంగా ప్రసుత్తం పనులకు హాజరయ్యే వేతనదారుల సంఖ్య తగ్గిందని అన్నారు. ఉదయం ఆరు గంటలకే పని ప్రారంభించి 10 గంటల లోపు పనులను ముగించేలా చూడాలని, వేతనదారులకు అవగాహన కల్పించి హాజరు పెంచేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. గజపతినగరం క్లస్టర్ ఉపాధి హామీ ఏపీడీ ఈ.జనార్ధనరావు, ఏపీఓ బి.కృష్ణవేణి, ఈసీ సన్యాసిరావు, సాంకేతిక సహాయకులు పాల్గొన్నారు.

బ్రెయిన్ ట్యూమర్‌పై.. అవగాహన తప్పనిసరి

- అప్రమత్తతతో ముప్పు తప్పించవచ్చు : వైద్యులు
- జిల్లాలో ఏడాదికి రెండు వేల వరకు కేసులు
- నేడు బ్రెయిన్ ట్యూమర్ నివారణ దినం


బ్రెయిన్ ట్యూమర్ స్కాన్


ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో రోగికి ఎంఆర్ఐ బ్రెయిన్ స్కాన్ తీస్తున్న టెక్నీషియన్

విజయనగరం ఫోర్ట్: బ్రెయిన్ ట్యూమర్ (మెదడులో కణితి ఆకారంలో ఉన్న గడ్డ) ప్రాణాంతకమైనది. సకాలంలో గుర్తించి చికిత్స చేయించుకోకుంటే మృత్యువాత పడే ప్రమాదం ఉంది. వ్యాధి లక్షణాలు ఉన్నప్పటికీ చాలా మంది పట్టించుకోక ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. వ్యాధిని సకాలంలో గుర్తించి చికిత్స చేయించుకోగలిగితే వ్యాధి తీవ్రతను తగ్గించడానికి అవకాశం ఉంది. బుధవారం వరల్డ్ బ్రెయిన్ ట్యూమర్ డే సందర్భంగా సాక్షి అందిస్తున్న ప్రత్యేక కథనం.

రెండు వేల వరకు కేసులు

బ్రెయిన్ ట్యూమర్ వ్యాధి గురించి అధికశాతం మందికి తెలియదు. గతంలో ఈ వ్యాధి కేసులు అంతగా నమోదు కాకపోవడమే ఇందుకు కారణం. అంతేకాకుండా వ్యాధి నిర్ధారణకు సంబంధించి యంత్ర పరికరాలు గతంలో అందుబాటులో లేకపోవడం వల్ల కూడా వ్యాధి సోకినా.. అది బ్రెయిన్ ట్యూమర్ అని పోల్చుకోలేకపోయేవారు. ప్రస్తుతం జిల్లాలో ఏడాదికి 2 వేల వరకు కేసులు నమోదవుతున్నాయి. అధునాతన యంత్ర పరికరాలు అందుబాటులోకి రావడం వల్ల వ్యాధి నిర్ధారణ సులువవుతోంది. ట్యూమర్ (గడ్డ) శరీరంలో ఎక్కడ వచ్చినా పెద్దగా సమస్య ఉండదు. కాని మెదడులో గడ్డ పెరిగితే ప్రమాదకరం. మెదడులో పెరిగే గడ్డ క్యాన్సర్ అయితే మరింత ప్రమాదకరం. క్యాన్సర్ గడ్డ కాకపోయినప్పటికీ ఏదైనా అవయవాన్ని గడ్డ నొక్కి వేయడం వల్ల శరీరంలోని ఆ భాగంలో తేడాలు వస్తాయి. దాంతో అవయవం ఆరోగ్యంగా ఉన్నప్పటికీ మెదడులో ఏర్పడ్డ గడ్డ కారణంగా దాని కదలికలు మందగించడం , చచ్చుబడిపోవడం జరుగుతుంది.

వ్యాధి నిర్ధారణ ఇలా..

బ్రెయిన్ ట్యూమర్ లక్షణాలు కనిపించిన వారికి సీటీ బ్రెయిన్ స్కాన్, ఎంఆర్ఐ బ్రెయిన్ స్కాన్ చేయాలి. వ్యాధి నిర్ధారణ అయిన వారికి కీమోథెరపీ, టార్గటెడ్ డ్రగ్‌థెరపీ, తదితర చికిత్సలు అందించాలి.

బ్రెయిన్ ట్యూమర్ లక్షణాలు..

- దీర్ఘకాలిక తలనొప్పి
- తలలో తీవ్రమైన ఒత్తిడి
- ఉదయం సమయంలో తీవ్రమైన తలనొప్పి
- పడుకున్నప్పుడు మరింత ఎక్కువుగా తలనొప్పి రావడం
- వికారం, వాంతులు
- మాటలు సరిగా మాట్లాడలేక పోవడం
- మూర్ఛ రావడం
- కంటి సమస్యలు
- ముఖం ఓ వైపు తిరిగిపోవడం
- ప్రవర్తనలో మార్పు
- మతి మరుపు , స్పృహ కోల్పోవడం

అలసత్వం తగదు..



బ్రెయిన్ ట్యూమర్‌పై అలసత్వం పనికిరాదు. లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యున్ని సంప్రదించి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకుని చికిత్స తీసుకోవాలి. వ్యాధి పట్ల అలసత్వం వహిస్తే ప్రాణాలు పోయే ప్రమాదం ఉంది.

డాక్టర్ కె. మురళీకృష్ణ, న్యూరోసర్జన్, విజయనగరం